వినతి పత్రం అందజేస్తున్న గ్రామ మహిళలు

కేర్చిపల్లి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలి

వలిగొండ, మే 30 : కేర్చిపల్లి గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని యాదగిరిగుట్ట డిపో మేనేజర్‌కు బీఆర్ఎస్ పార్టీ మండల మహిళా విభాగం అధ్యక్షురాలు మద్దెల మంజుల ఆధ్వర్యంలో గ్రామ మహిళలతో కలిసి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మద్దెల మంజుల మాట్లాడుతూ గ్రామానికి బస్సు సౌకర్యం లేక వివిధ రకాల పనుల మీద జిల్లా కేంద్రంతోపాటు మండల కేంద్రానికి ప్రయాణికులు, మహిళలు, వృద్ధులు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బస్ సౌకర్యం ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తాటి చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడి మృతి

వలిగొండ, మే 30: ప్రమాదవశాత్తు తాటి చెట్టుపై నుంచి కింద పడి గీత కార్మికుడు మృతి చెందిన ఘటన వెల్వర్తిలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం కొమ్మ గాని వెంకటేశం(47)రోజు మాదిరిగానే కల్లు తీయడానికి తాటి చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కిందపడి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం ఇచ్చారు. 108 వాహనంలో బాధితుడిని భువనగిరి ప్రభుత్వ దవాఖానకు చికిత్స నిమిత్తం తరలించారు. బాధితుడిని పరిశీలించిన వైద్యులు మృతి చెందినట్లుగా నిర్ధారించారని 108 సిబ్బంది తెలిపారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

యాదగిరిగుట్ట, మే 30: మద్యానికి బానిసై జీవితం మీద విరక్తి చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శుక్రవారం యాదగిరిగుట్ట దేవస్థాన పరిధిలో చోటు చేసుకుంది. పట్టణ సీఐ భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని యాదగిరిపల్లికి చెందిన పొన్నం రాములు(39) గత 15 ఏండ్ల క్రితం సుజాతతో వివాహం జరిగింది. నాటి నుంచి రోజూ మద్యం సేవించి భార్య సుజాతను పట్టించుకోవడం లేదు. బయట కూలీ పనిచేసి వచ్చిన డబ్బులతో జల్సా చేసి మద్యాన్ని సేవించి ఇంటికి వెళ్లేవాడు. గురువారం మద్యం సేవించి ఇంట్లో లుంగీతో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇది గమనించి భార్య సుజాత ఇరుగుపొరుగు వారి సహకారంతో కిందికిదించారు. ఆయన మరణంపై తనకు ఎలాంటి అనుమానం లేదని మృతురాలి భార్య సుజాత పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సీఐ వెల్లడించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

పాఠ్యపుస్తకాల అందజేత

పాఠ్యపుస్తకాలు అందిస్తున్న ఎంఈవో

ఆత్మకూరు(ఎం), మే 30: మండలంలోని వివిధ పాఠశాలలకు ప్రభుత్వం నుంచి వచ్చిన పాఠ్యపుస్తకాలను ఉపాధ్యాయులకు శుక్రవారం ఎంఈవో కొత్త మహదేవ రెడ్డి అందజేశారు. గ్రామాల్లో బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలని, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, యువజన సంఘాలు సహకరించాలని ఆయన కోరారు.

గద్దర్ అవార్డుకు మల్లేశం సినిమా ఎంపిక

ఆలేరు టౌన్, మే 30 : చేనేత బతుకులను కండ్లకు కట్టినట్లుగా తన తల్లి పడుతున్న బాధను చూసి ఏడేండ్ల కఠోర శ్రమతో ఆసు యంత్రాన్ని సృష్టించిన చింతకింది మల్లేశం అబ్దుల్ కలాం అవార్డు , పద్మశ్రీ అవార్డు అందుకున్నాడు. శుక్రవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ గద్దర్ అవార్డుకు మల్లేశం సినిమా ఎంపిక కావడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. మల్లేశం సినిమాకు దర్శకత్వం, నిర్మాత, కథ, స్క్రీన్ ప్లే వహించిన రాజు రాచకొండ, నటీనటులు ప్రియదర్శి, అనన్య, మరి యు సినిమా నిర్మాణంలో పనిచేసిన వారందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లాలో సమస్యలు పరిష్కరించాలి

ఆత్మకూరు(ఎం), మే 30: యాదాద్రిభువనగిరి జిల్లాలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఈ నెల 6న వాసాలమర్రి గ్రామానికి రానున్న రేవంత్‌రెడ్డికి వినతి పత్రాన్ని అందజేయనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. హామీల పేరుతో ప్రజలను మోసం చేశారని అన్నారు. మూసీ పేరుతో హడావుడి చేసిన రేవంత్‌రెడ్డి ఇప్పటికీ సుందరీకరణ పనులు పూర్తి చేయలేదని అన్నారు. గంధమల్ల, బునాదిగాని కాల్వ పనులను పూర్తి చేసి సాగునీరు అందించాలన్నారు. మెడికల్ కాలేజీని రవాణా సౌకర్యం ఉన్న ప్రాంతంలోనే నిర్మించాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రియల్ ఎస్టేట్ వ్యాపారం పూర్తిగా జీరో స్థాయికి చేరి భూముల ధరలు పడిపోవడంతో రైతులు, సాధారణ వ్యాపారులు దెబ్బతిన్నారని, అనధికారికంగా సాగు భూమి, అసైన్డ్ భూముల్లో వెలసిన వెంచర్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ఘనంగా సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం

భూదాన్ పోచంపల్లి, మే 30 : పట్టణ కేంద్రంలో సీఐటీయూ 55వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించి జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ మంచాల మధు, పట్టణ కన్వీనర్ వడ్డేపల్లి యాదగిరి మాట్లాడుతూ కార్మికుల శ్రమను దోచుకుంటున్న పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా కార్మికులంతా ఏకమై తమ హక్కులను సాధించుకున్నారని అన్నారు.

ఈద్గాల వద్ద మౌలిక వసతులు ఏర్పాటు చేయాలి

అధికారులకు కలెక్టర్ ఆదేశాలు


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి అర్బన్, మే 30: బక్రీద్ పండుగ సందర్భంగా ఈద్గాల వద్ద మౌలిక వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ హనుమంతరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం మినీ మీటింగ్ హాలులో జూన్ 7 బక్రీద్ పండుగను పురస్కరించుకొని శాంతి సంఘం సమావేశం నిర్వహించారు. ముందుగా మత పెద్దలు చేసిన సూచనలు, సలహాలను కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బక్రీద్ ను దృష్టిలో పెట్టుకుని ఎలాంటి సమస్యలు తలెత్తకుండా సంబంధిత శాఖల ధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని ఆదేశించారు. నమాజ్ వేళలో కరెంటు ఉండేలా చూడాలన్నారు. బక్రీద్ దృష్ట్యా వెటర్నరీ వైద్యులు అందుబాటులో ఉండాలని, ఫిర్యాదులు వచ్చిన వెంటనే క్షేత్రస్థాయికి వెళ్లి శాంతిభద్రతల సమస్యలు పరిష్కరించాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటన జరగకుండా సోదరభావంతో ప్రశాంత వాతావరణంలో బక్రీద్ జరుపుకోవాలని తెలిపారు. డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ అక్షాంశ్ యాదవ్ మాట్లాడుతూ పవిత్ర బక్రీద్ పండుగ ఉన్నందున మసీదుల వద్ద అన్ని ఏర్పాట్లు చేస్తామని, బక్రీద్ పండుగ రోజులలో పూర్తి బందోబస్తు ఉంటుందని, ప్రతి రోజు పెట్రోలింగ్ నిర్వహిస్తామని, సెక్యూరిటీ ఏర్పాట్లు చేస్తామని అందరి సహకారంతో సామరస్య వాతావరణంలో బక్రీద్ పండగను నిర్వహించుకోవాలనిఅన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ ఏసీపీ లక్ష్మీనారాయణ, భువనగిరి ఆర్డీవో కృష్ణారెడ్డి, డీపీఓ సునంద, జిల్లా పశు వైద్య శాఖ అధికారి యాదయ్య, మత పెద్దలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు

క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి

ఎస్సై నాగరాజు

మోత్కూరు, మే 30: క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని అడ్డగూడూరు ఎస్సై నాగరాజు అన్నారు. మోత్కూరు షటిల్ క్లబ్ ఆధ్వర్యంలో క్రీడాకారులు బదిలీపై వెళ్లిన ఆయనను శుక్రవారం సన్మానించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో షటిల్ క్లబ్ క్రీడాకారులు శాలువా కప్పి జ్ఞాపికను అందజేశారు. కార్యక్మరంలో షటిల్ క్లబ్ అధ్యక్షులు ఎలిమినేటి జహంగీర్, క్రీడాకారులు మద్ది సోమేశ్వర్, రామచంద్రు, పోచం సోమయ్య, మర్రి అనిల్‌కుమార్, గనగాని నర్సింహ, అన్నెపు యాకు, సైమన్, రమేష్, వెంకన్న, శ్రీను పాల్గొన్నారు.

మోత్కూరులో ఎస్సై నాగరాజును సన్మానిస్తున్న క్రీడాకారులు

ధాన్యాన్ని వేగంగా కొనుగోలు చేయాలని అధికారులు ఆదేశిస్తున్న జిల్లా కలెక్టర్ హనుమంతరావు

ధాన్యం కొనుగోళ్లను పూర్తి చేయాలి

కలెక్టర్ హనుమంతరావు

వలిగొండ, మే 30: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మిగిలిపోయిన ధాన్యాన్ని త్వరితగతిన కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ హనుమంతరావు అధికారులను ఆదేశించాడు. శుక్రవారం మండలంలోని సంఘం, గోకారం గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో మిగిలిపోయి నిల్వ ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని, లారీల సమస్య లేకుండా చూసి కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలన్నారు. ధాన్యం కొనుగోలు వివరాలను ట్యాబ్ ద్వారా ఎంట్రీ చేసి రైతుల ఖాతాలో డబ్బులు జమ అయ్యేటట్లుగా చూడాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్ రెడ్డి, డీఆర్ డీ ఓ పీడీ నాగిరెడ్డి, సివిల్ సప్లై అధికారులు హరికృష్ణ, రోజారాణి, తహసీల్దార్ దశరథ తదితరులు పాల్గొన్నారు.

రెండు వందల రోజు. పని కల్పించాలి

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఉపాధి హామీ కూలీలు

భువనగిరి అర్బన్, మే 30 : ఉపాధి హామీ పథకంలో సంవత్సరానికి రెండువందల రోజుల పని కల్పించాలని, రోజూ కూలీ రూ.600 చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొండమడుగు నర్సింహ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. పోరాడి సాధించుకున్న ఉపాధి హామీ పథకాన్ని కేంద్రంలోని బీజేపీ మోడీ ప్రభుత్వం ఎత్తివేయాలని కుట్రలను చేస్తుందని ఈ కుట్రలకు వ్యతిరేకంగా కార్మికులు ఐక్యంగా పోరాడి చట్టాన్ని పరిరక్షించుకుందామని వారు పిలుపునిచ్చారు. శుక్రవారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఉపాధి హామీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం, చట్టపరి రక్షణ కోసం వందలాది మంది కార్మికులతో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు మహాధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం జిల్లా పరిపాలన అధికారి జగన్‌కు మెమోరాండం అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యు లు గంగాదేవి సైదులు, జిల్లా సహాయ కార్యదర్శులు సిర్పంగి స్వామి, గుంటోజు శ్రీనివాస్‌చారి, పల్లెర్ల అంజయ్య, కూకట్ల చౌ క్కా కుమారి, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వెంకటేశ్, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బొలగాని జెరాము లు, జీఎంపీఎస్ జిల్లా అధ్యక్షులు నరసింహ పాల్గొన్నారు.

బీర్ల అయిలయ్య.. పద్ధతి మార్చుకో!

కేసీఆర్, కేటీఆర్‌లను విమర్శిస్తే సహించేదిలేదు

బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య కరుమ


మాట్లాడుతున్న కర్రె వెంకటయ్య

యాదగిరిగుట్ట, మే 30: ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పద్ధతి మార్చుకో.. మాటిమాటికీ రాష్ట్ర తొలిసీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌లను విమర్శిస్తే సహించేది లేదని బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు, కురుమ సంఘం రాష్ట్ర నాయకుడు కర్రె వెంకటయ్య అన్నారు. శుక్రవారం పట్టణంలోని మీడియా సమావేశంలో మాట్లాడారు. కేసీఆర్, కేటీఆర్‌పై స్థాయిని మించి మాట్లాడితే మంత్రి పదవి వస్తుందని భ్రమలో ఉన్నావని అన్నారు. రాష్ట్రంలో ఎంతో మంది కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలకు లేని అత్యుత్సాహం ప్రదర్శించి మాట్లాడుతున్నావని తెలిపారు. కవిత మాటలను వక్రీకరించి మాట్లాడటం సరైంది కాదన్నారు. కేసీఆర్ కుటుంబం గురించి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. వ్యక్తిగత దూషణలు చేస్తే బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. ఆలేరు నియోజకవర్గంలో ఇప్పటి వరకు చేసిన అభివృద్ధి మాట్లాడాలని అన్నారు. అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. యాదగిరిగుట్ట దేవస్థానికి ఒక్క రూపాయి కేటాయించలేదన్నారు. దమ్ముంటే గుట్ట అభివృద్ధికి నిధులు తీసుకురావాలన్నారు. ఆలేరులో ఎన్నో సమస్యలున్నాయని ఇప్పటి వరకు అభివృద్ధి శూన్యమన్నారు. ఆలేరు నియోజకవర్గంలో కేవలం స్వగ్రామమైన సైదాపురం గ్రామానికే వందశాతం రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులను మంజూరు చేశావని, ఇప్పటి వరకు నియోజకవర్గంలో అన్ని గ్రామాలకు పథకాలను ఎందుకు వంద శాతం అమలు చేయలేకపోతున్నారో చెప్పాలన్నారు. అధికారంలోకి వచ్చి 18 నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఆలేరు అభివృద్ధిపై దృష్టి సారించకపోగా ప్రశ్నించిన ప్రతిపక్షం నాయకులను విమర్శిస్తూ కాలయాపన చేస్తున్నావన్నారు. ఇప్పటికైన బుద్ధి తెచ్చుకుని స్థాయిని మించి విమర్శించే పనులు మాని అభివృద్ధి పై దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు గుణగంటి బాబురావుగౌడ్, శారాజీ రాజేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్పీఎఫ్ ఆర్ఐ శేషగిరిరావు

భద్రతావైఫల్యం ఏమీలేదు

ఎస్పీఎఫ్ ఆర్ ఐ శేషగిరిరావు

యాదగిరిగుట్ట, మే 30: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామివారి దేవస్థానంలో భద్రతావైఫల్యం ఉందని వస్తున్న ఆరోపణలు నిజం కాదని ఎస్పీఎఫ్ ఆర్ ఐ శేషగిరిరావు వివరణ ఇచ్చారు. కొండపైన చింతపండు దొంగతనంలో నిందితులను పట్టుకున్నది ఎస్పీఎఫ్ సిబ్బందేనని గుర్తు చేశారు. శుక్రవారం యాదగిరికొండపైన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. అర్ధరాత్రి సమయంలో కూడ చింతపండు తరలిస్తున్నారన్న అనుమానంతో అక్కడే విధుల్లో ఉన్న ఎస్పీఎఫ్ సిబ్బంది గమనించి పట్టుకుని దోషులను పోలీసులకు అప్పగించడంతో పాటు ఆలయ అధికారులను అప్రమత్తం చేశామన్నారు. తమ పరిధి ప్రాంతంలో ఎస్పీఎఫ్ నిరంతరం అప్రమత్తంగా ఉన్నామన్నారు. ఎక్కడ ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా విధులు నిర్వహిస్తున్నామన్నారు. ఆలయ చరిత్రలో ఇప్పటి వరకు ఇలాంటి దొంగతనాలు జరుగలేదని, ఇక నుంచి జరుగకుండా పటిష్టమైన నిఘాతో ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీఎఫ్ ఎస్సై అనిల్, ఏఎస్సై మాణిక్ ప్రభు తదితరులు పాల్గొన్నారు.

వడ్డె ఓబన్న చరిత్ర భావితరాలకు అందించాలి

సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అయిలుమల్లు

యాదగిరిగుట్ట, మే 30: వడ్డెర కులస్తుల ముద్దుబిడ్డ, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సర్వసైన్యాధికారి స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న చరిత్ర భావితరాలకు అందించాలని వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, చారిటబుల్ ట్రస్టు రాష్ట్ర చైర్మెన్ శివరాత్రి అయిలుమల్లు ఆకాంక్షించారు. శుక్రవారం పట్టణంలోని వడ్డె ఓబన్న విగ్రహ నిర్మాణ భూమిపూజలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇలాంటి మహానీయులను గుర్తుంచుకుని వారి విగ్రహాలను ఆవిష్కరించడం సంతోషదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో వడ్డె సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పీట్ల మల్లేశ్, మార్కెట్ కమిటీ డైరక్టర్ శివరాత్రి దానయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎత్తరి గణేశ్, రాష్ట్ర నాయకుడు పల్లెపు యాదగిరి, జిల్లా ఉపాధ్యక్షుడు బోదాసు మహేశ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శివరాత్రి సురేశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి వరికుప్పల స్వామి, జిల్లా కార్యదర్శి పల్లపు సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

కో-ఆపరేటివ్ సొసైటీ బ్యాంకు శాఖ ప్రారంభం

నూతన శాఖను ప్రారంభిస్తున్న మాజీ ఎంపీపీ సుధాకర్‌గౌడ్, బ్యాంకు సీఈఓ రాంబాబు

బీబీనగర్, మే 30 : మండల కేంద్రంలోని పోచంపల్లి రోడ్డులో యాదాద్రి కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ బ్యాంకు నూతన బ్రాంచ్‌ను బ్యాంకు సీఈఓ గొలనుకొండ రాంబాబుతో కలసి మాజీ ఎంపీపీ యర్కల సుధాకర్‌గౌడ్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్యాంకు సీఈఓ రాంబాబు మాట్లాడుతూ యాదాద్రి జిల్లాలో 3వ శాఖ అని, ఖాతాదారులకు తమ బ్యాంక్ ద్వారా మెరుగైన సేవలందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోలి పింగల్‌రెడ్డి, పోటోళ్ల శ్యామ్‌గౌడ్, గోలి నరేందర్‌రెడ్డి, మల్లగారి శ్రీనివాస్, కాసుల అంజనేయులుగౌడ్, బ్యాంక్ చైర్మన్ పోల శ్రీనివాస్, డైరెక్టర్లు దూసరి చంద్రశేఖర్, నర్సింగరావు, బాచు శ్రీనివాస్, శ్రీధర్ వెంకట్ సురేష్, గొలనుకొండ స్వప్న, దొంతిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, రేఖల అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఆలేరు టౌన్, మే 30: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ కొండల్‌రావు తెలిపారు. ఆలేరు మండల కేంద్రంలో అతిథి గృహం వద్ద ఎస్‌హెచ్ఓ రజనీకర్‌తో కలిసి సైబర్ నేరాల పట్ల పలువురికి శుక్రవారం అవగాహన కల్పించారు. ఫోన్ యాప్‌ల పేరులతో పలు రకాల మోసాలు జరుగుతున్నాయని చెప్పారు. మీకు లోన్లు వచ్చినయని, బహుమతులు వచ్చాయని, కరెంటు బిల్లుపే చేయాల్సి ఉందని, సైబర్ నేరగాళ్లు వలపన్ని మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఆన్లైన్‌గేమ్‌లకు దూ రంగా ఉండాలని యువతకు ఆయన సూచించారు. ఆన్లైన్ గేమ్ ఆడటం ద్వారా విద్యావంతులు సైతం మోసపోయి, అప్పుల పాలై క్షణికావేశంలో ఆత్మహత్యలకు పాల్పడ్డ ఘటనలు చాలా ఉన్నాయన్నారు. స్థానిక పోలీసులు, ప్రజలు పాల్గొన్నారు.

వెల్వర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి స్వయం ప్రతిపత్తి కల్పించాలి

వినతి పత్రం అందజేస్తున్న జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం సభ్యులు

వలిగొండ, మే 30: వెల్వర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి స్వయం ప్రతిపత్తి హోదా కల్పించి ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయకార్యదర్శి సిర్పంగి ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం సభ్యులతో కలిసి జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో అంజయ్యకు వినతి పత్రం అందజేశారు. వెల్వర్తిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించి ఇరవై ఏండ్లు గడుస్తున్న ఇప్పటికి వేములకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అనుబంధంగా కొనసాగుతుందని, రోగుల వైద్య సమస్యలు దృష్టిలో పెట్టుకొని స్వయంప్రతిపత్తి ఆరోగ్య కేంద్రంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈరపల్లి ముత్యాలు, కల్కూరి ముత్యాలు, వేముల అమరేందర్, వేముల నాగరాజు, మచ్చ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అప్‌గ్రేడ్‌కు గ్రామ పెద్దల తీర్మానం

సమావేశంలో మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయులు కమలాకర్‌రెడ్డి

మోత్కూరు, మే 30: మండలంలోని పాలడగు ప్రాథమికోన్నత పాఠశాలను అప్‌గ్రేడ్ చేయుటకు గ్రామ పెద్దలు తీర్మానం చేశారు. బడి బాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గ్రామ పెద్దలు పాఠశాల ఆవరణలో సమావేశమయ్యారు. ఇటీవల పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మందుల సామేల్ హామీ మేరకు పాఠశాలలో 9వ తరగతిని ప్రారంభించుటకు గ్రామస్తులందరూ తీర్మానం చేశారు. గ్రామంలోని పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలకు పంపించాలన్నారు. పాఠశాలలో 9వ తరగతి ప్రారంభించాలని, విద్యాబోధనకు వలంటీర్ల నియామకానికి అవసరమైన నిధులు సమకూర్చుకోవాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. కార్యక్రమంలోప్రధానోపాధ్యాయులు కమలాకర్‌రెడ్డి, పీఏసీఎస్‌సీ చైర్మన్ పబ్బు అరుణ, మాజీ సర్పంచు మరిపెలిల యాదయ్య, మాజీ ఎంపీటీసీ అంతటి నర్సయ్య, పులగం వెంకట్‌రెడ్డి, ఎడ్ల భగవంతు, సింగిరెడ్డి నర్సింహారెడ్డి, రాజ్‌కుమార్, వెంకటేశం, ఉప్పలయంయ, మత్స్యగిరి పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

చౌటుప్పల్ రూరల్, మే 30 : చౌటుప్పల్ మండలం తూప్రాంపేటలో వ్యక్తి మృతదేహాన్ని శుక్రవారం పోలీసులు గుర్తించారు. వివరాల ప్రకారం వ్యక్తి మృతదేహంపై బ్లాక్ ప్యాంట్, పర్పుల్ కల ర్ షర్టు వేసుకొని 35 నుంచి 40 సంవత్సరాల వయస్సు ఉం టుంది. మృతదేహం కుళ్లిపోయి ఉండడంతో సుమారు మూడు రోజుల క్రితం చనిపోయి ఉండవచ్చునని పోలీసులు తెలిపారు. చౌటుప్పల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

INDUSIND BANK
COMMERCIAL VEHICLE FOR SALE
1. Mahindra Jeeto Plus 16 BS-VI - 2022 TS29TB2624
2. ape city nxt+cng BS6-2023 TS29TB6851
3. ape city nxt+cng BS6-2023 TS29TB7937
4. BAJAJ RE Diesel BS VI-2023 AP39VC5310
Cell No.7337351819
D.No.797, 1st Floor, BharathReddy Complex Opp: MRO Office, Main Road, Kodad-508206

PLOT FOR SALE
★సాగర్ హైవే, విజయవాడ హైవేలలో తక్కువ ధరలో అపార్ట్‌మెంట్ ప్లాట్లు, Indp. ప్లాట్లు & ఓపెన్ ప్లాట్లు HMDA/DTCP అప్రూవల్ LRS గల ప్లాట్లు కలవు. 9603444402.
NT-331100

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines, Extra Line - Extra Amount
5% GST అదనం
పూర్తి వివరాలకు:
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం,
గ్రా॥ చర్లపల్లి, మం॥ నల్లగొండ.
నల్లగొండ: 9182777625, 9182777635 | దేవరకొండ: 9182777635
హాలియా: 9182777059 | సూర్యాపేట: 9182777630 | భువనగిరి: 9182777638
మిర్యాలగూడ: 9182777059 | కోదాడ: 9182777630 | చౌటుప్పల్: 9182777638